క్లుప్తంగా

శ్రీరామదీక్ష స్వీకరణ


దీక్షలు స్వీకరిస్తున్న శ్రీరామభక్తులు

సరుబుజ్జిలి: ఆధ్యాత్మిక చింతన ద్వారానే ముక్తికి మార్గం లభిస్తుందని రొట్టవలస రామానందాశ్రమం వ్యవస్థాపకుడు తొత్తడి వెంకటరమణ స్వామి తెలిపారు. ఆశ్రమం ఆవరణలో రామదీక్షలు మంగళవారం ప్రారంభించారు. దీక్షవల్ల భక్తిభావనతోపాటు, ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. దీక్షతీసుకున్న భక్తులు విరమణ కోసం భద్రాచలం వెళ్తారన్నారు.

విద్యార్థులకు బ్లడ్‌గ్రూప్ పరీక్షలు


బ్లడ్‌గ్రూప్ పరీక్షలు చేయించుకున్న విద్యార్థులు

సరుబుజ్జిలి: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లడ్‌గ్రూప్ పరీక్షలు మంగళవారం నిర్వహించినట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ గణపతి ధనుంజయరావు తెలిపారు. విద్యార్థులు పోషకాలు, విటమిన్లు లభించే పదార్థాలు వినియోగించాలన్నారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు సత్యనారాయణ, పవన్‌కుమార్ 120 మంది విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేశారు. ఎన్ఎస్ఎస్ పీఓ దుగ్గివలస రామ్‌ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

52 కోళ్ల యూనిట్లు పంపిణీ


కోళ్ల యూనిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీఎం రవిరాజ్

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు 52 కోళ్ల యూనిట్లును మంగళవారం పంపిణీ చేశామని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్ రవిరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని వైకేపీ పార్యాలయం వద్ద కోళ్ల యూనిట్లను అందజేశారు. ఒక్కొక్క యూనిట్‌లో 12 కిలోల బరువు ఉండే 11 కోళ్లు ఉంటాయన్నారు. యూనిట్ ధర రూ.3,970 అన్నారు. కోళ్ల యూనిట్‌తోపాటు 30కిలోల దాణా, కోళ్లు మూత వేసుకునేందుకు గూడు ఇస్తామన్నారు. మండలానికి 100 కోళ్ల యూనిట్లు పంపిణీ చేసేందుకు లక్ష్యంగా తీసుకుంటే 52 సంఘాల సభ్యులే డబ్బులు చెల్లించారన్నారు. యూనిట్ కావలసిన సభ్యులు ముందుగా డబ్బులు చెల్లించాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ ఏడీ, వైకేపీ డీపీఎం ఎం.సన్యాసిరావు ఉన్నారు.

ఒత్తిడికి గురికావద్దు

ఆమదాలవలస: పదో తరగతి విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఒత్తిడిలేకుండా చదవాలని వమ్మరవిల్లి డైట్ అధ్యాపకుడు అల్లు అప్పన్న సూచించారు. స్థానిక లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'పరీక్ష పర్వ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల్లో ప్రతి ఒక్క విద్యార్థి తానే ప్రథమ స్థానం సాధించాలనే లక్ష్యంతో చదవాలన్నారు. భవిష్యత్ కోసం ఏయే కోర్సులు తీసుకోవాలో వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, నేషల్, స్టేట్ చైల్డ్‌రైట్స్ కమిషన్, ఎస్.సి.ఈ.ఆర్.టి, సమగ్రశిక్ష, జిల్లా విద్యాశాఖలు సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.వి.రమణమ్మ, ఉపాధ్యాయులు సి.హెచ్.వెంకటరమణ, కె.అప్పలనాయుడు, వి.గోపీకృష్ణ, బి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు ఈకేవైసీ తప్పనిసరి


యారబాడులో ఈకేవైసీ చేస్తున్న ఏఓ

నరసన్నపేట: రైతులు ఏ సీజన్‌లో అయినా పంట వేసినా దానిని ఈ–క్రాప్ చేయించుకోవాలని, అనంతరం వ్యవసాయ సహాయకుల వద్ద ఈకేవైసీ చేయాలని వ్యవసాధికారి కె.సునీత అన్నారు. ప్రతి పంటకూ ఈకేవైసీ తప్పనిసరి అని అన్నారు. మంగళవారం యారబాడు, వీఎన్‌పురం గ్రామాల్లో ఈకేవైసీ ప్రాధాన్యతను రైతులకు వివరించారు. ఈ నెలాఖరుకల్లా రైతులు తాము పండించిన పంటలను నమోదు చేసుకుని, అనంతరం ఈకేవైసీ చేయించాలన్నారు. అనంతరం కట్టె జనుము పైరును పరిశీలించి రైతులకు యాజమాన్య పద్ధతులు వివరించారు.

26న వైద్య శిబిరం

సరుబుజ్జిలి: ఈ నెల 26న పురుషోత్తపురం గ్రామంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. మాజీ సర్పంచ్ కిల్లి వెంకట నర్సింగరావు జ్ఞాపకార్థం ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఉదయం పది గంటలకు శిబిరానికి పాత రిపోర్టులు తీసుకురావాలన్నారు.


నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ పి.లత, అధ్యాపకులు, విద్యార్థులు


సారవకోట: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అవలింగి జేబీటీ పాఠశాల విద్యార్థులు

అమ్మభాష అమృతం

- ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం


నరసన్నపేట: సత్యవరం ఉన్నత పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మాతృ భాషను నేర్చుకుంటూ ఇతర భాషల్లోని విజ్ఞానాన్ని సొంతం చేసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. తెలుగు భాష గొప్పతనం, సంస్కృతి, సంప్రదాయాలను ఇతరులకు తెలియజేయాలన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం నిర్వహించి, ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మాతృభాష గొప్పతనంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

– సాక్షి నెట్‌వర్క్


పాతపట్నం: మాట్లాడుతున్న ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చక్రపతి

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు


ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న నాయకులు

పోలాకి: జిల్లాలో రాజకీయంగా వెనుకబడి ఉన్న యాదవ సామాజిక వర్గానికి శాసన మండలిలో అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులకు పోలాకి మండల యాదవ సామాజికవర్గానికి చెందిన నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం బెలమర గ్రామంలో గంగమ్మతల్లి సంబరాలకు వచ్చిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ కర్రి గౌరినాయుడు సమక్షంలో పలువురు నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యత కల్పించిన సీఎం ఉద్దేశాన్ని ఊరూరా వెళ్లి ప్రచారం చేస్తామన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీకి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సాలిన నగేష్‌కుమార్, కరగాన రాము, కర్రి శేషగిరి పాల్గొన్నారు.

శ్రీముఖలింగం సన్నిధిలో ఎంపీ జీవీఎల్


స్వామివారి సన్నిధిలో ఎంపీ నరసింహారావు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు మంగళవారం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అర్చకులు స్వామివారి చరిత్ర, ఆలయ విశేషాలు వివరించారు.

తండ్యాంలో 'ఫ్యామిలీ డాక్టర్'


వైద్య సేవలు అందజేస్తున్న వైద్యుడు రమేష్‌నాయుడు

పొందూరు: మండలంలోని తండ్యాం గ్రామంలో తాడివలస పీహెచ్‌సీ వైద్యాధికారి జి.రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గర్భిణులు, బాలింతలతో పాటు మంచం పట్టిన రోగులకు, బీపీ, షుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీహెచ్‌ఓ హర్షి, ఏఎన్ఎం సుశీల తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని వినతి


ధాన్యం కొనుగోలు చేయాలని డీటీకి విన్నవిస్తున్న రైతులు

ఎల్.ఎన్.పేట: రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని ముంగెన్నపాడు గ్రామానికి చెందిన రైతులు కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని, రైతు భరోసా కేంద్రానికి వెళ్తే కొనుగోలు చేయటం లేదని రైతులు యారబాటి తెలిపారు. ఇప్పటికే నూర్పుడి చేసి సుమారు 2 వేల బస్తాల వరకు ధాన్యం రైతుల వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇంకా నూర్పుడి చేయాల్సి ఉందని, ధాన్యం కొనుగోలు లేకపోవటంతో కుప్పలతో ఉంచామని తెలిపారు. ఉప తహసీల్దార్ రషీద్ అహ్మద్‌కు వినతిపత్రం ఇచ్చారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకుంటామని డీటీ అన్నారు.

ఎరువుల పంపిణీ

జలుమూరు: పాగోడు రైతు భరోసా కేంద్రంలో రాయితీపై ఎరువులను రైతులకు ఎంపీపీ వాన గోపి మంగళవార పంపిణీ చేశారు. బసివాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు, నిర్వాహకులకు సూచనలు చేశారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మధరావు పాల్గొన్నారు.


పాగోడులో ఎరువులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వాన గోపి

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో నెలకొన్ని విద్యుత్ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ తెలిపారు. మండలంలో తోటాడ ఫీడర్‌లో గల విద్యుత్ స్తంభాల ఏర్పాటును మంగళవారం పరిశీలించారు. పంట పొలాల్లో వేళాడుతన్న తీగలను సరిచేయడంతోపాటు వాలిన స్తంభాలను సరిచేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా విద్యుత్ సమస్య తలెత్తితే వెంటనే సచివాలయంలో ఉన్న ఎనర్జీ అసిస్టెంట్‌కు సమాచారం అందజేయాలని సూచించారు. నిరంతర విద్యుత్ అందించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పుణ్యఫలం.. చక్రతీర్థ స్నానం


సరుబుజ్జిలి: ఉమాకామేశ్వరిస్వామికి చక్రతీర్థ స్నానాలు

పాతపట్నం: మండల కేంద్రానికి సమీపంలో గల మహేంద్రతనయ నదిలో నీలకంఠేశ్వర, కేథారీశ్వర స్వాముల చక్రతీర్థ స్నానాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాతపట్నం పరిసర గ్రామాలతో పాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం ఉదయం పన్నెండు గంటలకు మహేంద్రతనయ నదికి ఆవతల ఉన్న నీలకంఠేశ్వర, నదికి ఇటువైపున ఉన్న కేథారీశ్వర స్వాముల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చారు. నది వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు, సుగంధ ద్రావ్యాలు, పంచామృతాలతో స్నానాలు నిర్వహించారు. అదే సమయంలో భక్తులు పుణ్య స్నానాలను ఆచరించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ వాసుదేవరావు తగిన చర్యలు తీసుకున్నారు.

పురుషోత్తపురంలో..

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామంలోని ఉమాకామేశ్వరస్వామి వారి చక్రతీర్థ స్నానాలు వంశధార నదిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగవరపు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సమూర్తులను వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ తీర ప్రాంతానికి తరలించారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, అనంతరం చక్రతీర్థస్నానాలు నిర్వహించారు. పలు గ్రామాల భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బూర్జ మండలంలో..

బూర్జ: మండలంలోని పలు గ్రామాల్లో చక్రతీర్థ స్నానాలు ఘనంగా నిర్వహించారు. మధనాపురం గ్రామంలో గల కాశీవిశ్వేశ్వర స్వామికి చక్రతీర్థ స్నానాలు వైభవంగా నిర్వహించారు. కె.కె రాజపురంలో ఉమాధరాంబికేశ్వరస్వామి చక్రతీర్థ స్నానాలు ఆలయ అర్చకుడు వి.నందికేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ పెద్ద చెరువులో చేపట్టారు. అల్లెన గ్రామంలో గల ఉమాబాలంకేశ్వర స్వామి వారికి చక్రతీర్థ స్నానాలు నాగావళి నదిలో నిర్వహించారు. లక్కుపురం గ్రామంలో గల కాశీవిశ్వేశ్వర స్వామి వారి చక్రతీర్థ స్నానాలు అర్చకుడు మీగడ రామలింగేశ్వర స్వామి ఆధ్వర్యంలో నాగావళి నదిలో చేపట్టారు. భక్తులు, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.


పాతపట్నం: మహేంద్రతనయ నదిలో నీలకంఠేశ్వరుడికి చక్రతీర్థ స్నానాలు చేస్తున్న భక్తులు


బూర్జ: అల్లెనలో ఉమాబాలంకేశ్వరస్వామి చక్రతీర్థ స్నానాలు చేయిస్తున్న భక్తులు

బలహీనవర్గాలే వైఎస్సార్‌సీపీకి బలం


గృహసారథులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందరికీ సముచితస్థానం
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ద్వారా విశాఖ రాజధాని ఆకాంక్ష వినిపించాలి
- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గుండెల్లో పెట్టుకున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మంగళవారం పోలాకిలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనమండలి సభ్యుల ఎంపికలో ముఖ్యమంత్రి జగన్ సామాజిక న్యాయాన్ని పాటించి బలహీనవర్గాలే పార్టీకి బలం అనే సంకేతాన్ని ప్రజల్లోకి గట్టిగా పంపించారన్నారు. సీఎం జగన్ పరిపాలనలో ప్రతి వర్గానికి సముచిత స్థానం దక్కిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హతే ప్రామాణికంగా, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజలకు, పార్టీకి మధ్య వారధిలా పనిచేసి వచ్చే ఎన్నికల్లో ఎదురులేని మెజార్టీతో అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం విశాఖపట్నం రాజధాని ఆకాంక్ష బలంగా వినిపించేలా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను బలపర్చాలని పిలుపునిచ్చారు.


'మానమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ల గురించి వివరిస్తున్న కృష్ణచైతన్య

అది పాదయాత్ర కాదు: కృష్ణచైతన్య

చంద్రబాబు తనయుడు లోకేష్ చేస్తున్నది పాదయాత్ర కాదని, అది టీడీపీకి పాడె యాత్ర అని పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. ప్రతి ఇంటికీ నువ్వే మానమ్మకం జగనన్న అనే స్టిక్కర్‌ను సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న వారి అనుమతితో వారి ఇంటికి అతికించాలన్నారు. పథకాలు వద్దు అనే వారి నుంచి లిఖితపూర్వకంగా వినతి తీసుకోవాలన్నారు. గృహసారథులకు అందించే కిట్‌ను గూరించి వివరించారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ డోల ఉదయ్‌భాస్కర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించాలి


ఓటర్ల లిస్టును అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్ విజయానికి కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నాయకులందరూ గ్రామాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలో సుమారు 5 వేల మంది ఓటర్లు ఉన్నారన్నారు. పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల వారిగా ఓటర్లు లిస్టులను ఆయా మండలాల నాయకులకు ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీపీ దొర సావిత్రమ్మ, మెళియాపుట్టి జెడ్పీటీసీ గూడ ఎండయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్ సుందరావు, ఉర్లాన బాలరాజు, కొల్ల కృష్ణ, సూర్యనారాయణ, ఎ.వి.సురేష్, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, పార్టీ నాయకులు ఉదయ్‌కుమార్, రెడ్డి రామారావు, ఎస్.ప్రదీప్, పి.యోగి, రామకృష్ణ, కె.త్రినాథరావు, సూర్యం, ఏంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టీడీపీ దుష్ప్రచారాలు ప్రజలకు తెలియజేయండి..

టీడీపీ నాయకుల తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి సూచించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మెళియపుట్టి మండలం గొప్పిలికి చెందిన జామి మాధవరావు, జెడ్డాన లక్ష్మణరావు తదితరులు ఎమ్మెల్యేను కలిశారు. వైఎస్సార్‌సీపీలోనే మొదటి నుంచి ఉన్నామని, ఇటీవల టీడీపీ నాయకులు తమ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, రాజకీయం చేశారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ నాయకుల మాయ మాటలు నమ్మవద్దన్నారు.

సంక్షిప్తంగా..

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అవసరం


డాన్స్ చేస్తున్న చిన్నారులు

కొత్తూరు: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ ఎంతో అవసరమని కొత్తూరులోని శ్రీరాజ్‌శ్రీనివాస్ ఉన్నత పాఠశాల డైరెక్టర్ భూలక్ష్మి, కర్స్పాండెంట్ చిన్నము నాయుడు అన్నారు. పదో తరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, డాన్స్‌లు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శివ జయంతి వేడుకలు


ఓం శాంతి జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని గూనభద్ర గ్రామంలో గల ఓం శాంతి ధ్యాన మందిరం వద్ద 78వ శివజయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మకుమారిల ఆధ్వర్యంలో ఓం శాంతి పతకాన్ని ఆవిష్కరించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ద్వాదాశ జ్యోతిర్లింగాలను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన

మెళియాపుట్టి: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కొత్తూరు ఐకేపీ కన్సల్టెంట్ కె.దాసునాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని కేరాసింగి, గొట్టిపల్లి, ఆంపురం, ఇల్లాయిపురం సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఇల్లాయిపురం సచివాలయంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులకు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. ఆర్టికల్ 40 ప్రకారం గ్రామసభల నిర్వహణ, సమస్యల పరిష్కారంలో భాగంగా పంచాయతీ పాత్ర, తదితర విషయాలను తెలియజేశారు. ఏరియా కో ఆర్డినేటర్ నాగరాజు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ జగన్నాథం పాల్గొన్నారు.

వేలంపాట వాయిదా

ఆమదాలవలస: ఈ నెల 23న మున్సిపల్ కార్యాలయంలో జరగాల్సిన వేలంపాట వాయిదా పడినట్లు మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మార్కెట్, చింతాడ వారపు సంతలో ఆశీలు వసూలు, మేకలు, గొర్రెలు వధశాలల ఫీజు వసూలుకు సంబంధించిన బహిరంగ వేలంపాట (2023–2024 సంవత్సరానికి) వేయాల్సి ఉందని, అయితే ఎమ్మెల్సీ ఎన్నికోడ్ కారణంగా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత వేలంపాట నిర్వహించనున్నామని, తదుపరి తేదీని ప్రకటిస్తామని, దీన్ని ప్రజలు గమనించాలన్నారు.

డ్రాపౌట్ విద్యార్థులకు దూర విద్యలో అడ్మిషన్లు


ప్రిన్సిపాల్ వైకుంఠరావు

మెళియాపుట్టి: ఇంటర్మీడియెట్‌లో చేరి హాజరు తక్కువ, కొన్ని పరిస్థితుల నేపథ్యంలో మధ్యలో చదువు ఆపేసిన విద్యార్థులకు ప్రభుత్వం దూర విద్య ద్వారా అవకాశం కల్పిస్తుందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వైకుంఠరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్మీడియెట్ బోర్డ్, ఏపీఓఎస్ఎస్ వారు సంయుక్తంగా డ్రాపౌట్స్ నివారణే ధ్యేయంగా దూరవిద్యను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు కళాశాలలో అడ్మిషన్లు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తివివరాలు కళాశాలకు వచ్చి తెలుసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కొత్తూరు: ప్రకృతి వ్యవసాయంపై స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ యాంకర్ బాబాజీ అవగాహన కల్పించారు. మండలంలోని పారాపురంలో మంగళవారం నవధాన్యాల అభియాన్ వారోత్సవాలను వైస్ ఎంపీపీ తులసీవరప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రసాయన ఎరువులు వినియోగిస్తే భూమి సారవంతం కోల్పోతుందన్నారు. అనంతరం లబ్బలో వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. పారాపురం సర్పంచ్ కుంచాల రత్నాలు తదితరులు పాల్గొన్నారు.